# 'పాన్'డు రంగము

"హల్లో ... !" అవతల ఆడగొంతు. అదోలాగుంది. ఎవరబ్బా !

"హల్లో ... ఎవరూ ?" అదుర్దాగా అడిగింది రమణి.

"నేను... పావనిని. ఇప్పుడే రైలు దిగాను. అమరేందర్ గారున్నారా ?" వసంత కోయిల పసందు గానం లాగుంది.

"ఎందుకూ ?" రమణి భృకుటి ముడిపడింది.

"వారు... నాక్కావల్సిన వారండీ ! ప్లీజ్ చెప్పండి..."

మావారు దానిక్కావల్సిన వారా ! గుండె గుబేల్ మంది.

"మాట్లాడ్తుందెవరూ... నెల్లూరు నెజాణనా, పుల్లూరు పూబోణివా ?" గొంతులో కొచ్చింది ధుమధుమ.

"అట్లంటే ఎట్లా ... ?"

"మరింకెట్లానటా ! మావారికి నీకూ ఏమిటి సంబంధం ? నీకెలా కావల్సిన వారయ్యారు ?" అరికాలిమంట నెత్తికెక్కింది.

"అదంతా ఇంటికొచ్చాక చెప్తాగదా... అవన్నీ ఫోన్లో ఎలా ?"

"అయితే ఇంటిమీదికే వస్తున్నావన్న మాటా. రావే ... రా !" కసిగా అనేసి రకీన ఫోన్ పెట్టేసింది. తువ్వాలుతో తల తుడుచుకుంటూ బాత్రూంలోంచి బయటికొస్తున్న భర్త కెదురెల్లింది.

"పావని అంటే ఎవరండీ ... దాని వయసెంత ?" కుతకుత లాడింది. లోపలి నుండి ఎసరు పొంగుకొస్తుంది.

"నీకంటే చిన్న వయస్సే... ఫోన్ చేసిందా ?" కాజువల్‌గా వెళ్లి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూచున్నాడు అమరేందర్.

"అయితే... ఆవిడ మీకెప్పుడు పరిచయమైందో !" వెటకారం.

"చాలా రోజుల క్రితమే"

"మన పెళ్లై పదేళ్లయిందిగదా" ఏడుపొస్తున్నట్టు గొంతులో గురుగుర "ఆ సంగతి నాకెప్పుడూ చెప్పలేదే !" ముక్కుపుటాలెగిరి పడుతున్నాయి.

"ఇందులో చెప్పడానికేముందనీ. ముందు టిఫిన్ తయారు చెయ్, ఆఫీసుకు టైమయిపోతోంది."

మొన్నటికి మొన్న ఆమె ఫ్రెండు సీతకు... అమాయకురాలైన సీతకు భర్త అకారణంగా విడాకులిచ్చిన సంగతి గుర్తుకొచ్చింది రమణికి.

"... ఈ మగాళ్లంతా ఇంతేనే. మావారు శ్రీ రామచంద్రుడని మురిసిపోయావు గదా ! ఇప్పుడు తెలుస్తోందా ఆయన ఇంట్లో రామయ్య బయట కృష్ణయ్య అని..."

రమణిలోని రమణి ఎద్దేవా చేస్తూ నవ్వేసింది.

ఈయనతో వాదించడమెందుకూ ? వచ్చేదేదో రానీ, దాని పంజెప్తా. అట్లకాడ తిరగేసి ఐదారంటిస్తా... అనుకుంటూ వంటగదిలో దూరింది.

కుర్చీలో కూచుండి ఆరోజు వార్తాపత్రిక తిరగేస్తున్నాడు అమరేందర్. పత్రికలో అక్షరాలకు బదులుగా పాన్‌మసాలా పాండురంగం కనబడుతున్నాడు.

... గత సంవత్సరం వరంగల్లులో పంజేసేప్పుడు పాండురంగం తన కోవర్కర్. తానప్పుడు ఒక్కడే వరంగల్లులో ఉండేవాడు. భార్యాపిల్లలు ఇక్కడే ఉండేవారు. హోటల్ భోజనంతో పూటలు గడిచేవి.

ఆరోజు... పాండురంగం ఉద్యోగంలో జాయినయ్యేందు కొచ్చాడు. ఆరడుగుల అందగాడు, బుగ్గన కిళ్ళీ... మేకలా మసాలాపాన్ నములుతూ చాంబర్లో కొచ్చాడు.

"నమస్తే సార్...!" అంటూ జాయినింగ్ రిపోర్టిచ్చాడు. అతని మొహం అంకోర్ ట్యూబులైట్‌లా వెలిగిపోతోంది. అంతకు ముందేదో కంపెనీలో పంజేశానన్నాడు. కాస్సేపు కులాసాగా మాట్లాడాడు. మాటల మధ్యన "ఇక్కడ మీరే ఆఫీసరని... ఎంతో సంతోషించాను సార్ !" అన్నాడు – అంతకు ముందేదో అవినాభావ సంబంధమున్నట్టు. మస్కాపాలిష్‌లో మంచి ప్రావీణ్యత ఉన్నటుంది.

"సర్సరే..." ఇహ సాగనీయదల్చుకోలేదు. "పదండి మీ సీటు చూపిస్తా"నని తీసుకెళ్లి హెడ్ క్లార్కుకు పరిచయం చేయగానే

"అలాగా... రండి !" అంటూ హెడ్ క్లార్కు పాండురంగానికి సీటు చూపించాడు. పక్కనున్న గుమస్తాలు, టైపిస్టులు తనను వింతగా చూస్తూ చెవులు కొరుక్కుంటున్నారు. హెడ్ క్లార్కు తన వెంట చాంబర్లోకి వచ్చి,

"మీ షర్టు మీద తామర తుంపర చుక్కలన్నీ ఎలా వచ్చాయిసార్ ?" అడిగాడు – గల్లా మీద కళ్ళు నిలిపి.

అప్పుడు గమనించాడు తన తెల్లని షర్టు ముందు భాగము... ఎర్రని తుంపర చుక్కలతో నిండిపోయి ఉంది. అవి పాండురంగం నములుతున్న పాన్ బాపతువని వెంటనే అర్థమైపోయింది. అతడు ఆఫీసుకు కొత్త... తనకూ కొత్త...

"అరెరే నిజమే ఇదంతా పాండురంగం పాన్ మహత్యం..." అంటూ చేతి గుడ్డతో ఎంత తుడిచినా లాభం లేదు.

మర్నాడు ఆఫీసు కారిడార్ మెట్లమీద మూన్నాల్గు చోట్ల ఈగలు ముసురుతున్నాయి. అన్‌ది స్పాట్ స్వీపర్ను పిలిపించి

"ఇదేమిటీ ?" అని నిలదీస్తే

"సార్ ... ఆ కొత్త సారు... తమలపాకు నమిలి..." భయపడుతున్నాడు. ఇంతవర కతనికి వంకబెట్టిన వారు లేదు.

"ఉమ్మేశారా ?"

"అవున్సార్...'

వెంటనే పాండురంగాన్ని పిలిపించి "మీరిలా కిళ్లీ నమిలి అక్కడ ఉమ్మేస్తుంటే ఎట్లా... మసాల జర్దాపాన్ మంచి అలవాటు కాదు..." కాస్సేపు క్లాసుపీకి పంపించడమైంది. కాని ఏం లాభం ?

పాండురంగం ఎదురుగా నుంచుండి మాట్లాడాలంటే అందరు హడలిపోతున్నారు. చప్పరిస్తున్న జర్దా కిళ్లీ తుంపర్లు పళ్లసందుల్లో బిందురూపం దాల్చి ముందున్నవారి నభిషేకిస్తున్నాయి. ఆ బిందువుల పరిధి విస్తృతమై ఎదుటివారి మొహం, భుజాల దాకా పాకింది.

ఓ రోజు పాండురంగం పానాభిషేకానికి గురైన అటెండర్ "ఆ దరిద్రం జర్దా పాన్ తినకుంటే కొంపలంటుకుపోవు గదా ! ప్లీజ్ మానెయ్యండి సార్ !" చేతులు జోడించి సలహా ఇచ్చాడు.

"ఎంతో ప్రయత్నించాను కాని అదిలేకుండా ఉండలేనుబాబూ !" హీరో ఫోజిచ్చాడు పాన్ పాండురంగం.

"అదేమిటి సార్ ..." ఇంకేదో అనబోతున్న అటెండర్ను అమాంతం మింగేస్తానన్నట్టు చూస్తూ

"పో... పోవయ్యా, జర్దా పాన్ మజా నీకేం దెల్సు, వెనకట మహారాజులు, మహా మహా మంత్రులంతా ఈ కిళ్లీ నముల్తూనే రాచకార్యాలు నడిపేవారటా..." ఆ రోజుల్లో కిళ్లీ ఎలా కట్టేవారో, అందులో ఏమేమి పరిమళ ద్రవ్యాలు వేసేవారో... వివరాలన్నీ చెబుతూ అరగంట వాని బుర్ర తినేశాడు. తనతో పాటు అంతా గమనించారది.

"అదికాదు పాండురంగం !" సందర్భం దొరికింది గదాని హెడ్ క్లర్కు కల్పించు కున్నాడు. మీ ముందుకు రావాలంటే అందరికీ భయమేస్తుంది. ఆఫీసు మెట్లమీద మీరుమ్మేసిన కిళ్లీ అవశేషాల మీద ఈగలు, దోమలు ఝుంయ్మని ముసురుకుంటున్నాయి. వాటివల్ల అంటురోగాలు వ్యాపిస్తాయి. దయచేసి ఆఫీసుకొచ్చినప్పుడన్నా అది మానెయ్యండి." రిక్వెస్టు చేశాడు నుంచుండి.

పాండురంగం మొహం పంచరంగుల చిత్రమైంది.

"ఆఫీసులో పొగతాగడాన్ని నిషేధించారు కాని పాన్ నమలడాన్ని కాదు గదా!" మాయల ఫకీర్లా ఫోజిచ్చి తన సీటు మీద దర్జాగా కూచుండి కాలుమీద కాలేసుకున్నాడు.

అతని సెక్షన్ ఫైళ్ల కాయితాలు భయంకరమైన అద్దకం గుడ్డల్లాగుంటున్నాయి. ఓసారి ఘాటైన మెమో ఇస్తే ధీటైన జవాబొచ్చింది. ఆఫీసులో ఉమ్మేయడం ఆగలేదు.

ఆఫీసులో అవాంఛిత ప్రవర్తన... కారణంగా పాండురంగాన్ని సస్పెండు చేయక తప్పలేదు.

అదే రోజు సాయంత్రం భార్యతో సహా తన గదికొచ్చి బతిమిలాటకు దిగాడు. అతని భార్యవయసులో ఉన్న అందాల భామ. తనను ఎగాదిగా చూస్తోంది.

"మీరు ..." ప్రారంభించి తన పేరు, ఊరు, అన్నీ చెప్పేసింది. అవాక్కవడం తన వంతయింది. ఏదో వేలు విడిచిన బీరపీచు బంధుత్వం కలిసి అతి చనువుగా మాట్లాడింది. అప్పటికే తనకీ ఊరుకు ట్రాన్స్ఫరార్డరొచ్చింది.

"మీరెలాగైనా వెల్తున్నారు గదా ! నా సస్పెన్షనార్డర్ విత్‌డ్రా చేసి వెల్లండి సార్" నోట్లో పాన్ లేదప్పుడు.

"అదేం కుదరదు. తమరి కిల్లీ ప్రహసనం ఓ కొలిక్కి వస్తే అంతా సర్దుకుంటుంది. కాసింత ఇంగితజ్ఞానం అలవర్చుకుని ఎంక్వైరీలో నిజం ఒప్పుకోండి. కిల్లీ మాత్రం వెంటనే మానండి."

"కాని ... మీరు వెల్తున్నారు గదా !"

"చార్జి ఇచ్చేప్పుడు నా రిలీవర్‌కీ విషయం చెప్తాను. మీ సస్పెన్షన్ రివోక్ కావచ్చు" హామీ ఇచ్చి "పాండురంగంను పాన్ మోజులోంచి బయటకు లాక్కొచ్చే బాధ్యత తమరిదే"నని భార్య కప్పగింతలు పెట్టడమైంది.

"టిఫెన్ రెడీ..." అంటూ రమణి బయటికొచ్చింది.

"నమస్తే ..." పావని ప్రవేశంతో రమణి మొహం ఎర్ర గులాబీలా మారింది.

"వచ్చావా ... వన్నెల విసనకర్రా" అంటూ పావనిని చెయ్యందుకుంది విసురుగా.

"ఆగండాగండి. ఈవిడ నా భార్య" సిగ్గుతో బయటనుంచున్న పాండురంగం పరుగెత్తుకొచ్చాడు.

విషయమంతా చెప్పేసింది పావని. చివరికి

"మావారు జర్దాపాన్" మానేసారన్నయ్యా !

"తప్పు ఒప్పుకున్న సంగతి, చిన్న పనిష్మెంటిచ్చి సస్పెన్షన్ ఎత్తేసినట్టు ఫోన్‌లో తెలిసింది." అమరేందర్ హుషారుగా చెబుతున్నాడు. "ఇక్కడికి మా ఆఫీసుకు ట్రాన్స్ఫర్ చేసినట్టు ఆర్డర్ కాయితం చెప్పింది." పాండురంగాన్ని ఎగాదిగా చూస్తూ "ఇక ముందు కూడా మా చెల్లి చెప్పినట్టు విని బుద్ధిగా ఉద్యోగం చేసుకోండి". కూచొమ్మని కుర్చీలు పంపించాడు.

"బాగున్నావా వదినా" పావని రమణి చెయ్యందుకుని తన చెంపకు రాసుకుంది.

రమణి ముఖము బంతిపువ్వులా విచ్చుకుంది.

"ముందు టిఫిన్లు చెయ్యండి" అంటూ హుషారుగా వంటింట్లోకెళ్ళింది.

*(జలధి - 1-2-2004)*